29న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 22: ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ పక్కన ఉన్న సాయిబాబా ఆలయం 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సత్య పండిట్, దేవాలయ ట్రస్టు సభ్యులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 29 ఉదయం 5:30 నిమిషాలకు కాగడ, హారతి, 6:30 గంటలకు పంచామృత అభిషేకం, 9గంటలకు సాయిసత్య వ్రతం, 12 గంటలకు హారతి, 12:30 గంటలకు అన్నప్రసాదం ,7గంటలకు పల్లకీసేవలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు,తీర్థప్రసాదులు స్వీకరించాలని వారు కోరారు.

నేడు రుక్మిణీసత్యభామ వేణుగోపాల స్వామి కల్యాణం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి22: ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23 శుక్రవారం రుక్మిణీసత్యభావ వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తయ్యాయని ఆలయ ధర్మకర్తలు అప్పలాచార్యులు, రాంప్రసాద్,వర్ధదరాజులు తెలిపారు.ఉదయం 11 గంటలకు ఉత్సవ విగ్రహాల అలంకరణ అనంతరం కల్యాణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 24 శనివారం సాయంత్రం 6గంటలకు స్వామివార్ల విమాన రథోత్సవ జరుగుతుందని వివరించారు.భక్తులు పాల్గొని స్వామి వారి దర్శన భాగ్యం పొందాలని కోరారు.

మల్కాజిగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్

ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

మల్కాజిగిరి, ఫిబ్రవరి 22: మల్కాజిగిరిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కార్యాయంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌సింగ్ జహీరాబాద్‌లోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

బెడిసికొట్టిన కాంగ్రెస్ వ్యూహం

- నాగారం, తూంకుంటలో వీగిన అవిశ్వాసాలు
- పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్
- ఆ రెండు మున్సిపాలిటీలు 'గులాబీ' ఖాతాలోనే
- పారని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాచికలు

తూంకుంట మున్సిపాలిటీలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆర్డీవో శ్యాంప్రకాశ్

మేడ్చల్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో పట్టు కోసం కుయుక్తులు పన్నుతున్నది. పాలకవర్గ సభ్యులను ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి మున్సిపాలిటీలను చేజిక్కించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల్లోగా నియోజకవర్గంలో ఉన్న మూడు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు తహతహలాడుతుంది. ఇందు కోసం పావులు కదుపుతుంది. కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అధికారం, ధనం ఆశచూపి, అవిశ్వాసాలకు తెరలేపింది. గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మినహా మిగితా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అవిశ్వాస పొగ పెట్టింది. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పాచిక పారినప్పటికీ నాగారం, తూంకుంట మున్సిపాలిటీల్లో మాత్రం బెడిసి కొట్టింది. కాంగ్రెస్ పన్నాగానికి బీఆర్ఎస్ అడ్డుకట్ట వేసింది. అవిశ్వాసాన్ని వీగిపోయేలా చేసి, పట్టు నిలుపుకుంది.

నాగారంలో అవిశ్వాసం అట్టర్‌ఫ్లాప్

నాగారం మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం అట్టర్‌ఫ్లాప్ అయింది. తీర్మాన ప్రతిపై సంతకం పెట్టిన 14 మందిలో ఒక్కరూ కూడా సమావేశానికి హాజరు కాలేదు. నాగారంలో మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో 14 మంది చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టనున్నట్టు 18 రోజుల క్రితం కలెక్టర్‌కు తీర్మాన పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అవిశ్వాసంపై సమావేశం నిర్వహించారు. ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు చైర్మన్, 12.30 గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసాలకు సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఆ సమయానికి అవిశ్వాసన తీర్మాన ప్రతిపై సంతకం చేసిన వారెవరూ రాలేదు. చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, దీంతో చైర్మన్‌పై అవిశ్వాస సమావేశాన్ని అధికారులు 1 గంటలకు మార్చారు. అప్పటికీ ఎవరూ రాలేదు. అలాగే వైస్ చైర్మన్‌పై అవిశ్వాస సమావేశాన్ని వాయిదా వేస్తూ రెండు సార్లు నిర్వహించినప్పటికీ ఎవరూ కాలేదు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసాలు వీగిపోయినట్టు ఆర్డీవో ప్రకటించారు. అవిశ్వాసాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ కమిషనర్ రాజేందర్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తూంకుంటలో నీచ రాజకీయం

తూంకుంట మున్సిపాలిటీని హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ నీచ రాజకీయానికి పాల్పడింది. తూంకుంట మున్సిపాలిటీలో చైర్మన్ కారింగుల రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్‌తో పన్యాల వాణీవీరారెడ్డితో పాటు 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో 11 మంది చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానం చేసిన ప్రతిని ఈనెల 5వ తేదీన కలెక్టర్‌కు అందజేశారు. గురువారం మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాశ్ ఆధ్వర్యంలో అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు చైర్మన్‌పై, 12.30 గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అవిశ్వాస సమావేశానికి కాంగ్రెస్‌కు చెందిన పూజాభరత్, ఎద్దు లక్ష్మీనాగేశ్ రాకుండా ఉంటారన్న సమాచారంతో అవిశ్వాసం వీగిపోతుందని భావించిన మిగితా కౌన్సిలర్లు కూడా సమావేశానికి రాలేదు. దీంతో ఆర్డీవో అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు.

నెరవేరని మాజీ ఎమ్మెల్యే తంత్రం

తూంకుంట మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన తంత్రం ఫలించలేదు. జవహర్‌నగర్ మాదిరిగా తూంకుంటలో నెగ్గుతామని భావించినప్పటికీ అవిశ్వాసం వీగిపోయింది. సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మాన ప్రతిని కలెక్టర్‌కు అందజేసిన మరుసటి రోజే ముగ్గురు కౌన్సిలర్లు సురేశ్, ఉమా ఆంజనేయులు, పూజాభరత్‌లు తమను తప్పుదారి పట్టించి, అవిశ్వాసన తీర్మాన ప్రతిపై సంతకాలు చేయించుకున్నారని అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అందులో తమతో అభివృద్ధి పనుల కోసం అని చెప్పి సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. ఆ తర్వాత తమకు అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకం చేసినట్టు తెలియవచ్చిందన్నారు. దీంతో తాము ఆందోళన గురై ఈ వినతి పత్రం సమర్పిస్తున్నామన్నారు. తమ సంతకాలను పరిగణలోకి తీసుకోరాదని కోరుతున్నామని అడిషనల్ కలెక్టర్‌కు అందజేసిన ప్రతంలో కోరారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అవిశ్వాసం నెగ్గేందుకు తెరవెనుక ఉండి, చక్రం తిప్పారు. కాంగ్రెస్ చెందిన పూజాభరత్ అందుబాటులో లేకపోవడంతో ఆమె కోసం కాంగ్రెస్ నేతలు సుధీర్ రెడ్డి చూపిన బాటలో తీవ్ర ప్రయత్నాలు చేసిన సమాచారం. ఆమెను సమావేశానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులను సైతం వేధింపులకు గురిచేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే చివరి వరకు ఆమె రాలేదు. అవిశ్వాసం వీగిపోయింది. దీంతో అసహనానికి గురైన కాంగ్రెస్ నాయకులు అధిష్ఠానం ఆదేశాలంటూ భరత్‌సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు బహిరంగంగా ప్రకటిస్తూ లేఖను విడుదల చేశారు. అంతేగాకుండా కాంగ్రెస్ నాయకులు, పలువురు కౌన్సిలర్లు మహిళ అని చూడకుండా కౌన్సిలర్ పూజ, భర్త భరత్ సింగ్ ఫొటోపై దొంగలు అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శ చేశారు. దీన్ని పలువురు తప్పు పట్టారు.

ఘనంగా పంచముఖి హనుమాన్, రామాలయ ప్రారంభోత్సవం

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ వెంకట్‌రెడ్డి

పీర్జాదిగూడ, ఫిబ్రవరి22:పీర్జాదిగూడ కార్పొరేషన్ 6వ డివిజన్ రాయంచకాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ పంచముఖిహనుమాన్, రామాలయం ప్రారంభోత్సవ మహోత్సవ కార్యక్రమం గురువారం వేద బ్రాహ్మణులచే ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సం సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి,ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ కొల్తూరు మహేశ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోచయ్య, బచ్చరాజు, నాయకులు కృష్ణగౌడ్, ప్రభు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నరేందర్

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 22: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఐటీసెల్ ఏసీపీ నరేందర్ సూచించారు. గురువారం వాజ్‌పేయినగర్‌లోని ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షతన షేర్ అంబ్రెల్లా ట్రస్టు ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఏసీపీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షేర్ అంబ్రెల్లా ట్రస్ట్ చైర్మన్ విజయ అర్చన,ఎస్సై శ్రీనివాస్, కోఆర్డినేటర్ చంద్రలేఖ, డాక్టర్ జగన్ , మల్లిక, డాక్టర్ రచన, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..



శ్రీనివాస్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శిరిషాసోమశేఖర్‌రెడ్డి

చర్లపల్లి, ఫిబ్రవరి 22: ఉప్పల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరిషాసోమశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు, సినీయర్ సిటిజన్ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. డివిజన్‌లలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీవాసులు, సినీయర్ సిటిజన్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శిరిషాసోమశేఖర్‌రెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రామారావు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, నాగు, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, శేర్‌మణెమ్మ, రాంచందర్‌గౌడ్, బాల్‌రాజు, రహీం, శ్రీనులతో పాటు జలమండలి సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి సన్మానం

ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో ఇటీవల స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా పారిశుధ్య కార్మికురాలు ఎస్ఎఫ్ఏ మంజులకు అవార్డు రావడంతో గురువారం కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆమెను సన్మానించి రూ.5వేల ప్రోత్సాహాకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రామారావు, నాయకులు రామిరెడ్డి, నాగు, రాంచందర్‌గౌడ్, శేర్‌మణెమ్మ, రహీం పాల్గొన్నారు.

ఆర్‌యూబీలను నిర్మించాలి: ఎమ్మెల్యే

ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ దేవానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 22: మల్కాజిగిరి నియోజకవర్గంలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీలను నిర్మించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్‌ల పరిధిలోని గౌతంనగర్, బొల్లారం, సఫిల్‌గూడ, అల్వాల్ లయోలా కాలేజీ సమీపంలో, వెంకటాపురం,కాకతీయనగర్,వినాయక్‌నగర్ వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద గేటు మూసిన ప్రతిసారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో రైల్వే అధికారులు వాజ్‌పేయినగర్ లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీని నిర్మించడానికి ఆమోదం తెలిపిందని, అనివార్య కారణాల వల్ల నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. ఇప్పటికే ఎంఎంటీఎస్ రెండో దశ నిర్మాణపనుల్లో వాజ్‌పేయినగర్, భూదేవినగర్‌లలో సేషన్‌ల నిర్మాణపనులు పూర్తి చేశారని అన్నారు. కొద్ది రోజుల్లో ప్యాసింజర్ రైళ్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని అన్నారు.గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు వచ్చిన ప్రతిసారి గేట్లు మూస్తే తీవ్రంగా ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులకు ఇబ్బందులు వస్తాయన్నారు. రామకృష్ణాపురం పై ఓవర్ బ్రిడ్జ్ నిర్మించి దాదాపు ఇరవై సంవత్సరాలు కావస్తుందని, ఇప్పటికే బ్రిడ్జి పైన వాహనాల రద్దీతో ప్రమాదాలు జరిగి చాలా మంది మృత్యువాతపడ్డారని అన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి మరో పై ఓవర్‌ను నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ దేవానంద్, నార్త్ ఈస్ట్ జోన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రవీందర్ రాజు, ఈఈలు సురేశ్, రాధిక, డీఈలు రామచందర్, సుదర్శన్, ఏఈ సాయికృష్ణ, రామయాదవ్, రమేశ, రామకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

రెడ్డికాలనీలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

చర్లపల్లి, ఫిబ్రవరి 22: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో గురువారం ఏఈ కీర్తి, సిబ్బందితో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపట్టిన పనుల్లో నాణ్యత పాటించేలా పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆమె అధికారులకు సూచించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో సౌకర్యాల కల్పనకు చర్యలు

ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌స్వామి

చర్లపల్లి, ఫిబ్రవరి 22 : చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ ఆరోగ్య ఉప కేంద్రాన్ని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌స్వామి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రంలో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆరోగ్య కేంద్రంలో అద్దెకు గది ఇచ్చిన విషయంలో తగు చర్యలు తీసుకుంటామని, గదిలో ఉన్న వస్తువులను వెంటనే ఖాళీ చేయాలని వారు ఆదేశించారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న ఆరోగ్య ఉపకేంద్రం ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ రామాదేవి, సిబ్బంది శ్యాంసుందర్, మహేశ్వరి, వరలక్ష్మి, నాయకులు వెంకట్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, సీతారామిరెడ్డి, ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, బాల్‌నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

జవహర్‌నగర్, ఫిబ్రవరి 22: మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్యను గురువారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎల్.తాజ్ మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 2024-2025 సంవత్సర నూతన బడ్జెట్, కార్పొరేషన్ పరిధిలో ఆదాయ పెరుగుదల విషయమై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, అకౌంటెంట్ సంగీత పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన

ఈసీఐఎల్ చౌరస్తాలో ఆందోళన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చర్లపల్లి, ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్య, శాంతియుతపద్ధతిలో జేఎన్‌టీయూ విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులపై, ఏబీవీపీ నాయకులు భౌతికదాడులు చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఏఎస్‌రావునగర్ డివిజన్ ఈసీఐఎల్ చౌరస్తాలో ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అన్వర్,నాయకులు పాల్గొన్నారు.

జేజేనగర్ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా..

జేజేనగర్ నూతన సొసైటీ సభ్యులు

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 22: జేజేనగర్ ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డి. లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. గురువారం ముత్యాలరావు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు డి. లక్ష్మీనారాయణ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా పి. వేలును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కే. ఉమేశ్, కోశాధికారిగా డి. కృష్ణ దేవి, డైరెక్టర్లుగా కే. వెంకటేశ్, వై. కొండల్‌రావు, జేకే. జయశ్రీ, డి. పి. రామ్, అలాపూల, ఏ.రాధ, డి.బాలకృష్ణ, నియమితులయ్యారు.

డంపింగ్ యార్డు తరలింపునకు నిధులు కేటాయింపు



పోచారం మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్,ఫిబ్రవరి22: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డు తరలింపుకు పాలకవర్గం ప్రత్యేక నిధులు కేటాయించింది. ఈమేరకు పాలకవర్గం గురువారం చైర్మన్ కొండల్‌రెడ్డి అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది.మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ గాంధినగర్ సమీపంలోని సర్వే నంబర్ 137,138లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు నుంచి ప్రతిరోజూ మంటలు, దట్టమైన పోగరావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయా ప్రాంతప్రజలు కాలుష్య నివారణ మండలికి ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు డంపింగ్ యార్డును సందర్శించి మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి జవహర్‌నగర్‌కు తరలించాలని నిర్ణయించి రూ.85లక్షల, 75వేలను పాలకవర్గం కేటాయించింది. ఈ నిధులను 15వ ఆర్థిక సంఘం నుంచి తీసుకోవాలని సభ్యులు నిర్ణయించారు.ఇక్కడి చెత్తను జవహర్‌నగర్‌కు తరలించేందుకు రూ.30లక్షలు,ఇప్పటి వరకు డంపింగ్ యార్డ ఉన్న స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.50లక్షలు, చెత్తను తొలగింపునకు శానిటేషన్ పనిముట్ల కొనుగోలుకు రూ.5లక్షల,75వేలు ఉపయోగించనున్నట్లు పాలక వర్గం తెలిపింది.సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్డ్యానాయక్, కౌన్సిలర్లు మహేశ్, బాల్‌రెడ్డి, హిమ.బి.హరిప్రసాద్, వెంకటేశ్ గౌడ్, సరిత, రవీందర్‌గౌడ్, పోచమ్మ, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అందించేందుకు లెప్రా సొసైటీ కృషి

లెప్రా సొసైటీ వార్షికోత్సవంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ డాక్టర్ విశ్వమోహన్ కటోచ్, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, వైద్యుల బృందం

చర్లపల్లి, ఫిబ్రవరి 22: దేశవ్యాప్తంగా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు లెప్రా సొసైటీ కృషి చేస్తుందని లెప్రా సొసైటీ చైర్మన్ డాక్టర్ విశ్వమోహన్ కటోచ్ పేర్కొన్నారు. చర్లపల్లిలోని లెప్రా సొసైటీలో గురువారం లెప్రా సొసైటీ 35వ వార్షికోత్సవాన్ని లెప్రా సొసైటీ చైర్మన్ డాక్టర్ విశ్వమోహన్ కటోచ్, చర్లపల్లి పారిశ్రామికవాడ ఐలా చైర్మన్ రోషిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో లెప్రా సొసైటీని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ముఖ్యంగా క్షయ, ,కుష్ఠు, బోధకాలు, ఎయిడ్స్ వంటి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేయడంతో పాటు రక్త నమునాలను సేకరించి వారికి కావల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఐలా చైర్మన్ రోషిరెడ్డి మాట్లాడుతూ లెప్రా సొసైటీకి కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, దేశంలో కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు లెప్రా సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు అనురాగ్ మాధవి, భార్గవ, బాంబే లెప్రాసీ ప్రాజెక్ట్ ప్రతినిధి డాక్టర్ వీవీ.పాయిలకు డాక్టర్ కేవీ దేశికన్ మెమోరియల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి స్నేహరాంచంద్రన్ బృందం సభ్యులు చేసిన నృత్యం చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఐసీఎంఆర్ డైరెక్టర్, బీఎంహెచ్ఆరీసీ ప్రతినిధి ప్రభా దేశిఖాన్, లెప్రా సొసైటీ బోర్డు సభ్యురాలు డాక్టర్ రుక్మిణిరావు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రశాంత్‌కుమార్ నాయక్, ప్రాజెక్ట్ కమ్యూనికేషన్ అధికారి డాక్టర్ ఇంద్రాని ఐలా, ఆర్ ఎంఒ డాక్టర్ మైఖిల్, హెడ్ ఆఫ్ ప్రోగ్రాం అరుణ్‌కుమార్, ఒంప్రకాశ్, డాక్టర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మ